శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

నెల్లూరు జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు

- రాష్ట్ర స్థాయిలో దక్కిన 5వ స్థానం - ఉత్తమ ఎన్నికల నిర్వహణ
- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో విశేష ప్రతిభకు గుర్తింపుగా అవార్డు
- అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు కలెక్టరేట్, జనవరి 25, ప్రభాతవార్త: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో అత్యుత్తమ ఎన్నికల మ్యాపింగ్‌ను సమర్థవంతంగా అమలు చేసినందుకు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ చేతుల మీదుగా ఈ అవార్డు జిల్లా కలెక్టర్ అందుకున్నారు. ఉత్తమ ఎన్నికల నిర్వహణతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో అత్యుత్తమ ఎన్నికల మ్యాపింగ్‌ను విజయవంతంగా అమలు చేయడం ద్వారా నెల్లూరు జిల్లా రాష్ట్ర స్థాయిలో 5వ స్థానం సాధించింది. ఈ విశిష్ట సాధనకు గుర్తింపుగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (పదవీ విరమణ) అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్‌లతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల యంత్రాంగం సమన్వయంతో చేసిన కృషి ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎన్నికల ఉప తహశీల్దార్ ఆషర్, ఉత్తమ బిఎల్ఓ పర్యవేక్షకుడిగా టి.ఎ. గూడూరుకు చెందిన రాంప్రసాద్, అలాగే జిల్లాలో అత్యధిక మ్యాపింగ్ సాధించిన ఉత్తమ బిఎల్ఓగా బొల్లం వెంకట రమణయ్యలకు కూడా అవార్డులు అందుకున్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

- ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేసే రోజు జాతీయ ఓటరు దినోత్సవం
- జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు

నెల్లూరు కలెక్టరేట్, జనవరి 25, ప్రభాతవార్త ప్రతి సంవత్సరం జనవరి 25న నిర్వహించే జాతీయ ఓటరు దినోత్సవం ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేసే రోజని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత విలువైన హక్కు అని, దాన్ని బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడవచ్చునని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఓటింగ్‌లో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని బలపరచాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు కలిగిన సీనియర్ సిటిజన్‌తో పాటు నూతనంగా ఓటర్‌గా నమోదు చేసుకున్న యువతను జాయింట్ కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, రెవిన్యూ డివిజనల్ అధికారి అనూష, కలెక్టరేట్ ఏవో విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గట్టుపల్లికి నీరు తీసుకురావాలన్న గొట్టిపాటి కలను నెరవేరుస్తా

ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి



కావలి, జనవరి 25 ప్రభాతవార్త : జలదంకి మండలం, గట్టుపల్లికి నీరు తీసుకురావాలన్న మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ గొట్టిపాటి కొండపనాయుడు కలను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలసి సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళి నీరు తీసుకురావడమే కాకుండా ఆయన ఆశయాలను కొనసాగిస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. స్వర్గీయ గొట్టిపాలి కొండపనాయుడు 24వ వర్ధంతి కార్యక్రమాన్ని కొండపనాయుడు చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా ఎమ్మెల్యే విచ్చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించి ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 1972లో ఎమ్మెల్యేగా ఎన్నికై 1978వరకు ఎనలేని సేవలు అందించి ప్రజల హృదయాల్ల చెరిగిపోని ముద్ర వేసుకొన్న నాయకుడు గొట్టిపాటి అని కొనియాడారు. రైతులకు సాగునీరు అందాలనే లక్ష్యంతో కాలువల విస్తరణ కోసం పోరాటం చేసి సోమశిల ఉత్తరకాలువ ఎక్సటెన్షన్ సాధించారని తెలిపారు. ఈయన సేవలను గుర్తించిన సిఎం చంద్రబాబునాయుడు ఉత్తర కలువకు గొట్టిపాటి కొండపనాయుడు కాలువగా నామకరణం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు ఉత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, గొట్టిపాటి కొండపనాయుడు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రమాధర్‌నాయుడు, రంగారావు ట్రస్ట్ సభ్యులు, కూటమి పార్టీ నాయకులు, వామపక్ష పారీటల నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు భరోసాగా సిఎం రిలీఫ్ ఫండ్

- రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, జనవరి 25, ప్రభాత వార్త: ఆరోగ్య భద్రత కఉ అత్యధిక ప్రాధాన్య తనిస్తూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ భరోసాగా నిలుస్తుం దని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు అర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని 67కుటుంబాలకు 39లక్షల రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి ఆనం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో మన రాష్ట్రంలో , ఇతర రాష్ట్రాల్లోని కార్పోరేటు ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు పొందిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా సిఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఒక్కొక్క కుటుంబానికి లక్షలాదిరూపాయలు ఆర్థికసహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉదారంగా మంజూరు చేస్తున్నారన్నారు. ఒక్క ఆత్మకూరు నియోజకవర్గంలో తమ ప్రభుత్వం అధికారంచేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకఉ 640మందికి 6.18కోట్ల రూపాయలు మంజూరు చేసి ఆకుటుంబాలకు అండగా నిచిందన్నారు. పేదల సంక్షేమంతోపాటు ఆరోగ్య భద్రతకఉ తమ ప్రభుత్వం పెత్తపీటవేస్తుందని ఈసందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

నెల్లూరు మున్సిపల్ పాఠశాలలపై మంత్రి నారాయణ స్పెషల్ ఫోకస్

- రూ.5.5 కోట్లతో బివీఎస్ పాఠశాల ఆధునీకరణ
- ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి
- కార్పొరేట్ శైలిలో 15 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- అంతర్జాతీయ ప్రమాణాలతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం

నెల్లూరు, జనవరి 25, ప్రభాతవార్త –వైద్యం నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దేందుకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నడుం బిగించారు. సామాన్యుల పిల్లలకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే సంకల్పంతో ఆయన నెల్లూరులోని మున్సిపల్ పాఠశాలలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా నేడు స్టోన్‌హౌస్ పేటలోని బీవీఎస్ మున్సిపల్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీవీఎస్ పాఠశాలను సందర్శించి మంత్రి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధి కోసం సుమారు రూ.5.5 కోట్ల సీఎస్ఆర్ నిధులను ఓ దాత కేటాయిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కేవలం భవనాలే కాకుండా అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్ రూమ్‌లతో ఈ పాఠశాలను కార్పొరేట్ సంస్థలకు ధీటుగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. బీవీఎస్ పాఠశాల మాత్రమే కాకుండా, నెల్లూరు నగర వ్యాప్తంగా 15 మున్సిపల్ హైస్కూల్స్‌ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి, అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇప్పటికే దాదాపు రూ.15కోట్లతో కేవలం నాలుగు నెలల రికార్డు కాలంలో వీఆర్ హైస్కూల్‌ను పునర్నిర్మించినట్లు చెప్పారు. దాతల సహకారం మరవలేనిదన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, డీఎస్ రెడ్డి వంటి ప్రముఖులు, జిగ్మా, రెడ్డి ల్యాబ్స్ వంటి కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులతో ఈ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారన్నారు. ముఖ్యంగా 42, 43, 48 డివిజన్ల లో పాఠశాలల కొరతను తీర్చేందుకు, 5 ఎకరాల స్థలంలో కొత్త పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. దీని కోసం ఎంపీ సీఎం రమేష్ సుమారు రూ.20 కోట్ల సాయం అందించేందుకు ముందుకు రావడం విశేషమన్నారు. పారిశుధ్య కార్మికులు, కూలీల పిల్లలు చదువుకునే ఈ మున్సిపల్ పాఠశాలలు ప్రపంచంలోనే అత్యుత్తమ పాఠశాలలుగా నిలుపుతామన్నారు. ప్రస్తుతం ఉన్న 54 మున్సిపల్ స్కూల్స్‌లో 10 వేల మంది చదువుతుంటే, మేము అభివృద్ధి చేస్తున్న ఈ 15 స్కూల్స్‌లోనే భవిష్యత్తులో 15 వేల మందికి పైగా విద్యార్థులు చేరేలా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడల కోసం స్టేడియంలను కూడా అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మంత్రి నారాయణ తీసుకుంటున్న ఈ చొరవతో నెల్లూరు విద్యా హబ్‌గా మారడమే కాకుండా, పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, ఇన్‌చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, 7వ డివిజన్ కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బిసి గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, జనవరి25 ,ప్రభాతవార్త: ఆత్మకూరులోని బిసి గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈసందర్భంగా పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మంత్రికి ఘనస్వాగతం పలికారు.

మంత్రి ఆనం మాట్లాడుతూ రథసప్తమి పర్వదినాన విద్యార్థుల చదువుల తల్లి అయిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.విగ్రహ మండపం నిర్మాణానికి ఆర్థికసహకారం అందించిన దాత కంచి పరమేశ్వర్‌రెడ్డి, గురుకుల పాఠశాల అధ్యాపకులను మంత్రి అభినందించారు. గురుకుల పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు అవసరమని కోరిన వెంటనే రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. త్వరలోనే సంబంధిత అధికారులతో అంచనఆలు తయారు చేయించి వచ్చే విద్యాసంవత్సరం నాటికి ప్రహరీగోడను పూర్తిస్థాయిలో నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలకు అవసరమైన అదనపు వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బాలికల విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పదేళ్ళక్రితమే ఆత్మకూరు నియోజకవర్గంలో గురుకుల విద్యాలయాలను ఏర్పాటు చేశామని మంత్రి ఆనం గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో ఆర్‌డిఒ పావని, తహసిల్దార్ పద్మజ, దాత కంచిపరమేశ్వర్‌రెడ్డి, గురుకుల పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుప్పాల నరసింహారావు కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి నారాయణ దంపతులు

కావలి, జనవరి 25, ప్రభాతవార్త: మాజీ సైనికులు, విశ్రాంత ఐఎస్ఆర్ఓ పుప్పాల నరసింహారావు ఇటీవల మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రమాదేవి దంపతులు కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి ఆదివారం రాత్రి కావలి శాంతినగర్‌లోని నరసింహారావు స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరడం జరిగింది. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం నరసింహారావు సేవలను మంత్రి నారాయణ, ఎమ్మెల్యే దగుమాటి కొనియాడారు.

రథసప్తమి వేడుకల్లో కోవూరు ఎమ్మెల్యే

కోవూరు జనవరి 25 ప్రభాతవార్త : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం రథసప్తమి పర్వదినం సందర్భంగా తిరుమలలో జరిగే శ్రీ వెంకటేశ్వర స్వామి వేడుకల్లో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే ప్రారంభమైన వాహన సేవలు భక్తులను ఎంతగానో తరింపజేస్తున్నాయి. ఈ వేడుకల సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే , తిరుమల తిరుపతి దేవస్థాన బోర్డు సభ్యులు ప్రశాంతిరెడ్డి తెల్లవారుజామున నిర్వహించిన సూర్యప్రభ వాహన సేవలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు , కార్యనిర్వాహణ అధికారి అశోక్ సింగాల్, బోర్డు సభ్యులతో కలిసి శ్రీవారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె రథసప్తమి ఏర్పాట్లపై ఆయా అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు.

మహానేత విగ్రహాన్ని మరిచిన టీడీపీ నాయకులు

కోవూరు, జనవరి 25 ప్రభాతవార్త : కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో నీళ్ల ట్యాంక్ సమీపంలో గత టీడీపీ పాలనలో సుజలం సుఫలం పథకం కింద 2 రూపాయలకే వాటర్ క్యాన్ అందించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. అప్పట్లో ఈ ప్రాంతంలోనే దివంగత నేత , మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అనంతరం అక్కడి విగ్రహం ఉందనే పరిస్థితి కూడా కోవూరు టీడీపీ నాయకులు ఎప్పుడూ పట్టించుకున్న దాఖలాలు లేవు. వర్ధంతి వేడుకలు జరిగినా.. జయంతి వేడుకలు జరిగినా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగినా ఈ మహనీయుని విగ్రహానికి కనీసం పూలమాల వేయాలని సంబంధిత టీడీపీ నాయకుల్లో లేకపోవడం గమనార్హం. ఇటీవల కాలంలో ఎన్టీఆర్ విగ్రహం పక్కనే ఏర్పాటు చేసిన సుజలం సుఫలం ప్లాంట్‌ను పూర్తిగా తొలగించారు. అప్పటి నుంచి ఈ మహనీయుని విగ్రహం ఎండకు ఎండి, వానకు తడుస్తూ అక్కడే ఉండే తప్ప దీనికి ఒక రూపు తెచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలనే ఆలోచన టీడీపీ నాయకుల్లో లేకపోవడం గమనార్హం. 9 నెలల్లో పార్టీ ఏర్పాటు చేసి మూడు దశాబ్దాలుగా పరిపాలనలో ఉన్న కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్లతో పెకిలించిన ఆ మహనీయుని విగ్రహం ఈ తాలూకా కార్యాలయ ప్రాంగణంలో దిగాలుగా పడి ఉండడం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తుంది.

విద్యుద్దీపకాంతులతో కలెక్టరేట్ ముస్తాబు

నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త జనవరి 26 రిపబ్లిక్ డే పురస్కరించుకుని జిల్లా, కలెక్టర్ కార్యాలయం విద్యుత్ దీపాలతో, ముస్తాబు అయింది. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని, మువ్వన్నెల జెండా రంగులతో కలెక్టర్ కార్యాలయాన్ని దీపాలతో అలంకరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల కార్యాలయ ఆవరణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

మాది చేతల ప్రభుత్వం - మంత్రి నారాయణ

- 47వ డివిజన్‌లో ఆయుష్ హోమియోపతి డిస్పెన్సరీకి శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ
- పేద ప్రజల వైద్యానికి పెద్దపీట - 30 లక్షలతో నూతన హోమియోపతి కేంద్రం
- ఆసుపత్రి కోసం స్థలాన్ని దానం చేసిన గూడూరు మునిస్వామి నాయుడిని అభినందించిన మంత్రి నారాయణ
- స్థలదాతలు, నిరుపేదల చిరకాల వాంఛ నెరవేరుతోంది - మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

నెల్లూ, జనవరి 25, ప్రభాతవార్త –వైద్యం పేద ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. 47వ డివిజన్ పరిధిలో సుమారు 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆయుష్ హోమియోపతి డిస్పెన్సరీ యూనిట్‌కు ఆయన ఆదివారం ఉదయం శంకుస్థాపన చేశారు. మంత్రికి స్థానికులు, టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. భూమి పూజ అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. స్థానికుల కోరిక మేరకు శిథిలమైన హోమియోపతి కేంద్రాన్ని పునర్ నిర్మిస్తున్నామని అన్నారు. ఆయుష్ హోమియోపతి యూనిట్ కోసం 30 ఏళ్ల క్రితం స్థలాన్ని దానం చేసిన గూడూరు మునిస్వామి నాయుడు సేవా దృక్పథం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఆయుష్ భవన నిర్మాణ పనులు మూడు నెలల్లో పూర్తి చేసి, పేద ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తాం అని తెలిపారు. ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామన్నారు. మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని మరో సారి స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అగ్రతాంబూలం వేస్తామన్నారు. అందు కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత లోకేష్ ఆలోచనలతో ఎక్కడికక్కడ ప్రజా దర్బార్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలతో పాటు,ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తున్నామని అన్నారు. నెల్లూరుకు ముంపు ముప్పు తప్పించేందుకు కాలువల ఆధునీకరణ పనులు చేపట్టామని, ఎవరికి ఇబ్బంది లేకుండా ఆక్రమణల తొలగింపులో మార్పులు చేశామని తెలిపారు. అభివృద్ధి కంతకులు ప్రజలను రెచ్చగొట్టె ప్రయత్నం చేస్తున్నారని వాళ్ళ కుట్రలు, మాయ మాటలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. గత పాలకులు అన్ని వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి వెళ్లారన్నారు. ఆర్థిక పరిస్థితి భాగా లేకున్నా అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడకుండా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని అన్నారు. నెల్లూరు సిటీని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా నిలిపాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నానని అభివృద్ధి పనులకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇన్‌చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ సమస్య చెబితే వెంటనే స్పందించే గొప్పనాయకులు మంత్రి నారాయణ అని కొనియాడారు. 47వ డివిజన్ వాసుల విజ్ఞప్తితో పదేళ్ల సమస్యను పరిష్కరించారన్నారు. ఆయుష్ భవన నిర్మాణాన్ని 3 నెలల్లో పూర్తి చేయమని, ఆదేశించారని, ఈ ఆసుపత్రి ఈ ప్రాంత పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మంత్రి నారాయణ నిబద్ధత పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారావు, ప్రెసిడెంట్ చెంగయ్య ఆచారి, టీడీపీ ముఖ్య నేతలు, ఆయుష్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మణిహారంగా నగరవనాన్ని అభివృద్ధి చేస్తాం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, జనవరి25, ప్రభాతవార్త : ఆత్మకూరు మణిహారంగా నగరవనాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారనాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆత్మకూరు ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని అటవీశాఖ భూముల్లో ఏర్పాటు చేయనున్న నగరవన ప్రాంతాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరిశీలించారు. నగరవన ఏర్పాటుపై అటవీ శాఖ అధికారులతో మంత్రి చర్చించారు. నగరవన అభివృద్ధికి రూపొందించిన మ్యాప్‌లను అధికారులు మంత్రికి వివరించారు. ఈసందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణప్రజలు ప్రకృతి ఒడిలో మానసిక ఆనందం పొందేలా ఆహ్లాదకర వాతావరణంలో నగరవనానిన అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం 1.40కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయగా ఇప్పటికే 98లక్షలు విడుదల చేశారన్నారు. ప్రాధాన్యతా క్రమంలో మిగలిన నిధులను కూడా విడుదల చేస్తామన్నారు. తొలివిడతలో సుమారు 100 ఎకరాల భూముల్లో అవసరమైన మేర భూమిని చదును చేసి వాకింగ్ ట్రాక్, క్రీడా పరికరాలు ఏర్పాటు, స్నేక్‌పార్క్, కాఫీ పార్క్, సోలార్ లైటింగ్ వ్యవస్థ, విస్తృత ప్లాంటేషన్ వంటి ఆహ్లాదకరమైన మౌళిక వసతులను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. నగరవనంలో ఆయుర్వేద ఔషధ విలువలు గల మొక్కలను బ్లాకులుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ నగరవనం ద్వారా ఆత్మకూరు పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందిస్తూ ప్రశాంత వాతావరణంలో సేదతీరే అవకాశాన్ని కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆత్మకూరులో అభివృద్ధిని పట్టాలెక్కించేందుకు క్రీడా మైదానాలు, నగరవనాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నగరవనానికి ముఖద్వారం, గేట్లు, క్రీడా సౌకర్యాలు ఏర్పాటు చేసి జిల్లాలోనే అతిపెద్ద నగరవనంగా దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో డిఎఫ్ఒ మహబూబ్‌బాషా, ఆర్‌డిఒ బి.పావని, తహసిల్దార్ పద్మజ, మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, అటవీశాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తుమ్మల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ



వింజమూరు, జనవరి 25, ప్రభాతవార్త వింజమూరులోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా ఈ ఆవిష్కరణ జరిగింది. పులిచర్ల నాగిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ ఇలాంటి మహనీయుని విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావడం మహా పుణ్యమని తెలిపారు. దేశం కోసం దేశ ప్రజల కోసం ఆయన మన దేశం నుండే కాకుండా జపాన్ నుండి ఆజాద్ హిందూ ఫౌజ్ అనే సంస్థను ఏర్పాటు చేసి బ్రిటీషన వారిని గడ

భక్తి శ్రద్ధలతో కలువాయమ్మ తల్లికి విశేష పూజలు

కలువాయి జనవరి 25 ప్రభాతవార్త : మండలకేంద్రమైన కలువాయిలో కొలువైవున్న గ్రామదేవత శ్రీ కలువాయమ్మ అమ్మవారికి ఆదివారంభక్తులు భక్తి శ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవస్థానం నందు విశేషంగా పూలతో అలంకరించారు. ఆదివారం రథసప్తమి రేవతి నక్షత్రంలో రావడంతో ఎంతో విశేషమైన రోజని దూర ప్రాంతాలనుండి కూడా భక్తు లు వచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ మరసటి వారాలలో దూర ప్రాంతాలలో ఉండే ఆడప దుచులు విశేషంగా అమ్మవారికి పూజలు నిర్వహించి శక్తి స్వరూపిణి అయిన కలువాయమ్మను వేడుకుంటు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ అదే విధంగా మద్యహ్నం పెద్ద ఎత్తున భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈకార్యక్రమాలను తన్నీరు ప్రభాకర్‌రావు, సుభాషిణి దంపతులు,గౌతమ్, గౌరి, వారి కుటుంబ సభ్యులు ఆద్వర్యంలో నిర్వహించారు.

ప్రజాస్వామ్యంలో శక్తివంతమైన ఆయుదం ఓటు

మనుబోలు జనవరి 25 ప్రభాతవార్త : ప్రజాస్వామ్యంలో శక్తి వంతమైన ఆయుదం ఓటు ,బానిసత్వ సంకెళ్ళు నుండి మనలను విముక్తి గావిస్తు ,రాజ్యాంగం మనకు కల్పించిన అత్యంత విలువైన హక్కు ఓటు హక్కు అని డిప్యూటి తహసిల్దారు ప్రదీప్‌కుమార్ అన్నారు. 16 వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రపంచస్థాయిలో ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచిన భారతదేశంలో మన పాలకులను మనమే ఎన్నుకునే అవకాశం ప్రతి పౌరుడికి లభించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం జూనియర్ ఓటర్ మాతంగి శ్రీనివాసులును,సీనియర్ ఓటర్లు గుణపాటి ఆదిశేషయ్య తుపాకుల చెంచురామయ్యలను శాలువా కప్పి పూమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో డిప్యూటి ఎంపిడిఓ గరుడయ్య, సర్వేయర్ అనురూప్,వీఆర్ఒలు రాకేష్, బల్లి శ్రీనివాసులు, మురళీదర్, నాగార్జునరెడ్డి, జూనియర్ ,సీనియర్ అసిస్టెంట్లు లాలూ అహ్మద్,విజయ్‌కుమార్, డిఇఒ సుప్రజ, టిడిపి నాయకులు రాజాగౌడ్, సాని వెంకటరమణయ్య,పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బృందావనం కాలనీలో రథసప్తమి వేడుకలు

కావలి, జనవరి 25 ప్రభాతవార్త : బృందావనం హౌసింగ్ కాలనీలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రథసప్తమి సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ప్రతి ఏడాది లాగా ఈ ఏడాది కూడా టిటిడిలో నిర్వహించే విధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు సూర్యప్రభ, చిన్నశేషవాహనం, గరుడ, హనుమంతు, చక్రస్నానం, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలలో స్వామిని ఊరేగించడం జరిగింది. ఈ వాహనాలను ఊరేగింపు ప్రాంతంలో భక్తులు, ప్రజలు గోవిందనామస్మరణతో మారుమ్రోగింది. అనంతరం స్వామివారు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీరామ మల్యాద్రి ఆలయ కమిటీ సబ్యులు బచ్చు వీరాస్వామి, ఏడుకొండలు, జలదంకి వెంకటేశ్వర్లు, రాజావెంకట రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు ఆడుతున్న ఐదుగురు అరెస్టు

కావలి, జనవరి 25 ప్రభాతవార్త : గుమ్మడి బొందల గ్రామంలో కోడిపందాలు ఆడుతున్న ఐదుగురిని రూరల్ పోలీసులు అదివారం అదుపులోకి తీసుకొన్నారు. రూరల్ సిఐ రాజేశ్వర్‌రావు కథనం మేరకు వివరాలిలావున్నాయి. కావలి రూరల్ మండలం గుమ్మడిబొందల గ్రామంలో కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందని ఎస్ఐలు ఎం.బాజీరావు, తిరుమలరెడ్డి, తన సిబ్బందితో కోడిపందాలు ఆడుతున్న స్థావరం వద్దకు వెళ్లి ఐదుగురిని అరెస్టుచేసి వారి నుంచి రూ.10,050లు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట, గంజాయి వంటి అసాంఘీక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఎస్‌కేఆర్ కళాశాల విద్యార్థులకు ప్రశంసలు

గూడూరు, జనవరి 25, ప్రభాతవార్త : గూడూరు స్థానిక ఎస్ కే ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో జరిగిన వివిధ పోటీలలో గెలుపొందిన విషయం విధితమే. విజేతలు అయిన విద్యార్థిని విద్యార్థులు బిఏ రెండవ సంవత్సరం చదువుతున్న ఆర్. శ్రీనివాసులు, బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న పి. శిరీషలు తిరుపతి జిల్లా కలెక్టర్, ఎలక్షన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అదేవిధంగా గూడూరు అసెంబ్లీ నియోజకవర్గం స్థాయిలో డిబేట్లో పాల్గొని ప్రథమ బహుమతి పొందిన బీకాం మూడో సంవత్సరం చదువుతున్న ఏ. సూర్య మౌనిక, మండల రెవెన్యూ అధికారిచే ప్రశంసా పత్రము మరియు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సింహాద్రి అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది విజేతలైన విద్యార్థులను అభినందించారు.

గ్రామానికి గర్వకారణం మా పాఠశాలకు జాతీయ గుర్తింపు: పోతన

తోటపల్లి గూడూరు, జనవరి 25, ప్రభాతవార్త: ముంగలదొరువు గ్రామంలోని ఎంపీపీ ఎస్ ప్రభుత్వ పాఠశాల స్వచ్ఛత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్ పోటీలకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని స్థానిక తెలుగుదేశం పార్టీ యువ నేత మొగలిగుంట పోతన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేం చదువుకున్న మా గ్రామ పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ముంగలదొరువు గ్రామానికి ఎంతో గర్వకారణం. పాఠశాలలో పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణను ఆదర్శంగా అమలు చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, స్కూలు యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని తెలిపారు. స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత, పారిశుధ్యం, పర్యావరణ అనుకూల చర్యలను సమర్థంగా అమలు చేసిన పాఠశాలలకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ముంగలదొరువు ఎంపీపీ ఎస్ పాఠశాల ఉత్తమ ఫలితాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ రిపబ్లిక్ డే రోజున సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఇది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని అన్నారు. చివరిగా, విద్యాబోధనతో పాటు స్వచ్ఛత, హరిత అభివృద్ధిలో కూడా మా పాఠశాల ఆదర్శంగా నిలవడం ప్రతి గ్రామస్థుడికీ ఆనందాన్ని కలిగిస్తోంది. ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షిస్తున్నాను అని మొగలిగుంట పోతన తెలిపారు.

16వ జాతీయ ఓటర్ల దినోత్సవం

తోటపల్లి గూడూరు, జనవరి 25, ప్రభాతవార్త : టిపీ గూడూరు బిట్-1 గ్రామంలోని ఓటింగ్ కేంద్రాలు 92, 93లలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శుక్రవారం జయప్రదంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ప్రధాన కార్యదర్శి మన్నం జితేంద్ర గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్ అయిన ఈదురు వీర రాఘవయ్యను, నూతన ఓటర్ అయిన మన్నెం పవన్ కుమార్‌ను శాలువాలు మరియు పూలమాలలతో ఘనంగా సన్మానించి, బహుమతులు అందజేశారు. అనంతరం ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి, పాల్గొన్న ఓటర్లతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. మహిళా ఓటర్లను చైతన్య పరిచేలా ముగ్గుల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ముఖ్య అతిథి మన్నం జితేంద్ర గౌడ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో ఓటర్లు, గ్రామ రెవెన్యూ అధికారి వెంకటేష్ (బూత్ స్థాయి అధికారి) తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రోడ్డుప్రమాదంలో ఆర్టీసి కండక్టర్ మృతి

ఆత్మకూరు, జనవరి25 ,ప్రభాతవార్త: ఆత్మకూరు పట్టణ సమీపంలో ఆదివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఉదయగిరి డిపో ఆర్టీసి కండక్టర్ , ప్రముఖ చిత్రకారుడు సుదర్శన్ దర్మురణం చెందాడు. ఆర్టీసి కండక్టర్‌గా విధులు నిర్వహించడంతోపాటు చిత్రలేఖనంలో విద్యార్థులకు శిక్షణనిస్తూ ఈప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రముఖుల చిత్రపటాలు గీయడంలో సుదర్శన్ దిట్ట.

టాలెంట్‌టెస్ట్‌లో శాంతినికేతన్ విద్యార్థిని ప్రతిభ

అనంతసాగరం, జనవరి25 ,ప్రభాతవార్త: ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో ఆదివారం ఆత్మకూరులో నిర్వహించిన మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ టెస్ట్ లో అనంతసాగరంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్ విద్యార్థిని వి.లౌక్య 4వ స్థానంలో నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ గోలిప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని లౌక్యని పాఠశాల డైరెక్టర్ పాపిశెట్టి నర్సింహులు, ఆత్మకూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాములు ప్రత్యేకంగా అభినందించారు.

డ్రోన్ పడగ నీడలో కావలి రైల్వే స్టేషన్

కావలి, జనవరి 25 ప్రభాతవార్త : విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని కావలి రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాలను గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఆదివారం కావలి జిఆర్‌పి ఎస్ఐ వెంకటరావు ఆధ్వర్యంలో సిబ్బంది రైల్వేస్టేషన్ పరిసరాలను డ్రోన్ కెమెరాల నీడలో నిఘా పెట్టడం జరిగింది. పలు రైళ్ళను కూడా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి రైల్వే భద్రతకు పలు చర్యలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి జిఆర్‌పి, ఆర్‌పిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుడు సమాచారాన్ని వైరల్ చేస్తే చర్యలు

ఉదయగిరి, జనవరి 25, ప్రభాతవార్త : సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని వైరల్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై కే.ఇంద్రసేనారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఉదయగిరి అడవుల్లో పెద్ద పులి సంచరిస్తుంది నిర్ధారణమైంది. అయితే గత రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో ఓ పెద్దపులి ఆడ దూడను చంపేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుందన్నారు. అయితే ఆ వీడియో ఉదయగిరి ప్రాంతానికి సంబందించింది కాదన్నారు. ఇలాంటి తప్పుడు వీడియోలను వైరల్ చేస్తే ప్రజలను భయబ్రాంతులను గురి చేసిందన్నారు. ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. తప్పుడు సమాచారాన్ని వైరల్ చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

మన ఓటు - మన భవిష్యత్తు

వింజమూరు, జనవరి 25, ప్రభాతవార్త : మనం వేసే ఓటు కేవలం ఒక కాగితం మీద ముద్రో లేదా బటన్ నొక్కడమో కాదు.. అది మన పిల్లల భవిష్యత్తును మార్చే శక్తివంతమైన ఆయుధం. మన నిర్ణయం రేపటి సమాజానికి దిశానిర్దేశం చేస్తుందని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పఠాన్ ఇమ్రాన్ ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం వింజమూరులో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెవెన్యూ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు విశిష్టతను చాటి చెప్పేలా సచివాలయ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు భారీ మానవహారంగా ఏర్పడి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు విలువపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటర్లందరితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత పవిత్రమైందని, దానిని కొనడం లేదా అమ్మడం నేరమని అధికారులు స్పష్టం చేశారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, నిస్వార్థంగా సేవ చేసే అభ్యర్థులను ఎన్నుకోవడమే ఓటరు బాధ్యత అని గుర్తు చేశారు. ఓటర్లు ఆత్మ పరిశీలన చేసుకుని ఓటు వేయాలని కోరారు. సేవా తత్పరత కలిగిన నాయకులను ఎంచుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. లేనిపక్షంలో స్వార్థపరుల చేతిలో ప్రజాస్వామ్యం కూని అవుతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఓబయ్య, వీఆర్వోలు పరిశుద్ధరావు, శిరీష, జూనియర్ సహాయకులు మహేష్, కృష్ణాంజలి, కంప్యూటర్ ఆపరేటర్లు ప్రసాద్, వరలక్ష్మీ, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

16వ జాతీయ ఓటర్ల దినోత్సవం

వింజమూరు, జనవరి25, ప్రభాతవార్త : వింజమూరు మండలం శంఖవరం పంచాయతీ పరిధిలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని బత్తుల ఆనంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఓటర్ల దినోత్సవ సందర్భంగా ప్రతి ఓటరు చైతన్యవంతమై నిజాయితీపరులైన అభ్యర్థులను ఎన్నుకోవాలన్నారు. ఓటును అమ్ముకోవడం కొనడం రెండు నేరమని తెలిపారు. ఓటర్లు నిజాయితీపరులుగా ఉండి సేవా తత్పరులైన అభ్యర్థులను ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, రవి, ఏడుకొండలు, అజయ్, వంశీ, న్యాయవాది అశోక్, గ్రామస్తులు ఉన్నారు.

రిపబ్లిక్ డే వేడుకల్లో పీఆర్ఎన్ విద్యార్థుల నృత్యం

కోవూరు జనవరి 25 ప్రభాతవార్త : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పాఠశాల నృత్య ఉపాధ్యాయులు అనూష పర్యవేక్షణలో ఒక మంచి దేశభక్తి గేయాన్ని గత నెల రోజులుగా వారికి తర్ఫీదు ఇచ్చి వారిని తీర్చిదిద్దారు.

యువత ఓటును సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు జనవరి 25 ప్రభాతవార్త : కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రెవెన్యూ సచివాలయ కాలేజీ విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కోవూరు ఇన్‌చార్జి తహసీల్దార్ మురళి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కోవూరు పురవీధుల్లో ప్లకార్డులు చేపట్టిన ఈ ర్యాలీ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఓటరుగా చేసిన యువతకు సర్టిఫికెట్లు, పెన్‌లను అందజేశారు.

గోనుపల్లిలో గిరిజనుడి అంత్యక్రియలకు రాజా రెడ్డి సాయం

రాపూరు, జనవరి 25, ప్రభాతవార్త : మండలంలోని గోనుపల్లి గ్రామ ఎగువ గిరిజన సంఘంలో ఆదివారం యాకసిరి రమణయ్య మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు గోనుపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు ఈగా రాజా రెడ్డి రూ. 5వేల నగదు సాయాన్ని మృతుని అంత్యక్రియలు నిమిత్తం వారి కుటుంబసభ్యులకు ఆందజేశారు. రామయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న రాజా రెడ్డి ఏగువ సంగంలోని మృతునినివాసానికి చేరుకోని నివాళుర్పించి వారి కుటుంబసభ్యులను పరమార్శించారు. అనంతరం మృతుని అంత్యక్రియలకు రూ. 5వేల నగదు సాయాన్ని వారి కుటుంబసభ్యులకు ఆందజేశారు. గ్రామంలో పేదవారిని ఆదుకోవడంతో పాటు, గ్రామంలో రోడ్లు, తాగునీటి పైపులైన్లు స్వంత నిధులతో ఏర్పాటు చేస్తున్న రాజా రెడ్డి దాతృత్వాన్ని పలువురు ప్రశంచిస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..?

- అల్లూరు రోడ్డు రైల్వే ప్లే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై ఎన్‌హెచ్ఏఐ నిర్లక్ష్యం

దగదర్తి, జనవరి 25, ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదాలు నివారించాలని జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాదికార సంస్థ కోట్ల రూపాయలు వెచ్చించి రహదారుల నిర్మాణం చేపడుతుంది. కానీ 16వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న అల్లూరు రోడ్డు రైల్వే ప్లే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుంది. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది క్షతగాత్రులై మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా కనీస సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదు. 2005లో చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించి నిర్మించారు. ఇందులో భాగంగా అల్లూరు రోడ్డు వద్ద ఉన్న రైల్వే పై ఓవర్ బ్రిడ్జిని కూడా నాలుగు లైన్లతో నిర్మాణం పూర్తి చేశారు. మరలా 2011లో నాలుగు లైన్ల రహదారిని ఆరు లైన్లుగా విస్తరించి నిర్మాణం చేశారు. దీనిలో భాగంగా ప్లై ఓవర్ బ్రిడ్జిని ఆరు లైన్లుగా విస్తరించి నిర్మించాల్సి ఉన్న సుమారు 50 సంవత్సరాల క్రితం రెండు లైన్లతో నిర్మించిన పురాతన బ్రిడ్జిని కొనసాగించి కావలి వైపు వాహనాలు వెళ్లేలా రాకపోకలు కొనసాగించారు. జాతీయ రహదారిపై భారీ వాహనాలు అధిక లోడులతో రాకపోకలు జరుగుతున్న నేపథ్యంలో బ్రిడ్జి కూలితే రైల్వే ట్రాక్‌పై పెను ప్రమాదం సంభవిస్తుందని రైల్వే అధికారులు ముందుగానే గమనించి శిధిలావస్థలో కూలేందుకు సిద్ధంగా ఉన్న బ్రిడ్జిని నూతనంగా నిర్మాణం చేపట్టాలని హైవే నిర్మాణ అధికారులను కోరారు. అయినా వారు పట్టించుకోలేదు. సుమారు 7 సంవత్సరాల క్రితం జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ, రైల్వే అధికారులు పురాతన బ్రిడ్జిని పరిశీలించి రాకపోకలు నిలిపివేసి శిధిలావస్థకు చేరిన ఈ బ్రిడ్జిని అధికారులు పూర్తిగా ధ్వంసం చేసి తొలగించారు. కానీ తొలగించిన రైల్వే బ్రిడ్జి నిర్మించాల్సి ఉన్న ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. నూతనంగా నిర్మించిన మూడు లైన్ల బ్రిడ్జి ద్వారానే ఇరువైపులా రాకపోకలు సాగించేలా హైవే అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఇరువైపులా రాకపోకలు ఇప్పటికే మూడు లైన్ల ద్వారానే కొనసాగించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. లైన్ల మధ్యలో డివైడర్ కోసం హైవే అధికారులు రాళ్లను ఏర్పాటు చేశారు. కానీ సూచిక బోర్డులు ఇతర ప్రమాద హెచ్చరికలు కనీసం రాళ్లపై రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటు చేయలేదు. రాత్రులు ఎదురెదురుగా వస్తున్న వాహనాల లైట్ల వెలుతురుకు రహదారి కనపడకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతే కాకుండా ఈ బ్రిడ్జి వద్దకు వచ్చేందుకు మలుపులు ఏర్పాటు చేయడంతో వేగంతో వస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అల్లూరు రోడ్డు రైల్వే స్టేషన్‌కు వెళ్లాలన్న ప్రజలు జాతీయ రహదారి పై రోడ్డు దాటాలంటే ఎటునుంచి ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆవెల్ బస్సు ప్రమాదానికి గురైంది. మోటారు బైక్ పై వెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి కింద పడిపోవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. బోగోలు మండలం మంగమూరుకు చెందిన యువకుడు మోటారు బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి కింద పడిపోవడంతో దుర్మరణం పాలయ్యాడు. ఇటువంటి ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. అయినా జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ ప్రమాదానికి కారణమవుతున్న రైల్వే బ్రిడ్జి విస్తరణ పనులు చేపట్టడం లేదు. రోడ్డు ప్రమాద నివారణకు ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. కానీ తరచూ ప్రమాదాలు జరుగుతున్న రైల్వే బ్రిడ్జి సమస్య మాత్రం జాతీయ రహదారుల సంస్థకు పట్టడం లేదు. ఇప్పటికైనా నిలిచిపోయిన రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేయాలని రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థులు తమపై తాము నమ్మకం ఉంచుకోవాలి

కోవూరు జనవరి 25 ప్రభాతవార్త : కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, పరీక్షలపై భయాన్ని విడనాడాలనే అవగాహన కార్యక్రమాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ మనస్తత్వ శాస్త్రజ్ఞులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు తమపై తాము నమ్మకం ఉంచుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. పరీక్షలంటే ఉన్న బెరుకుతనాన్ని విడనాడి తప్పక ఉత్తీర్ణులవుతామని ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించాలని పట్టుదల ఉన్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వంద రోజుల ప్రణాళికను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. కష్టపడితే ఫలితాలు రావని, ఇష్టపడితేనే అవి మీ వెంట పరుగులు తీస్తాయన్నారు. తల్లిదండ్రులు కూడా పరీక్షల సమయంలో పదవ తరగతి విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడిని ఉంచరాదని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌బాబును కళాశాల ప్రిన్సిపాల్ . శ్రీనివాసరావును, డీన్ డాక్టర్ టీఎల్ఎన్‌కుమార్‌లను జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఈ శిబిరాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి శోభారాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూలు తిరుపతయ్య, హజరత్తయ్య, మనోజ్, సుధామణిలు పలు సూచనలు చేశారు.

రాపూరులో ఘనంగా జాతియ ఓటర్ల దినోత్సవ వేడుకలు

రాపూరు, జనవరి 25, ప్రభాతవార్త : జాతియ ఓటర్ల దినోత్సవ వేడుకలను ఆదివారం రాపూరు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలలో ఘన

సంగం జెడ్పి హైస్కూల్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవం

సంగం జనవరి 25 ప్రభాతవార్త : సంగం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాల వద్ద జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తహసిల్దారు సోమ్లానాయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి తహసిల్దారు,టిడిపి నాయకులు, బిఎల్ఓలు ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ సిటిజన్స్ నూతన ఓటర్లను తహసిల్దారు సోమ్లానాయక్, టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ముగ్గుల పోటీలు, వ్యాస రచన పోటీలలో గెలుపొందిన వారికి బహు మతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో అత్యంత కోలహ లంగా జరిగింది.

సంగం శివాలయంలో వేడుకగా రథసప్తమి వేడుకలు

సంగం జనవరి 25 ప్రభాతవార్త : మండలకేంద్రమైన సంగంలోని శివాలయంలో వైభవంగా భక్తులు రథసప్తమి వేడుకలు నిర్వహించారు. వేకోజామునుండి భక్తులు ఆలయానికి చేరుకొని ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. సూర్యభ గవాను డికి హరతులు ఇచ్చి భక్తి శ్రద్ధలతో ప్రార్థిం చారు. పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహి ంచారు.

సూర్యభగవానుడి అలంకారంలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి

బుచ్చి జనవరి 25 ప్రభాతవార్త : రథసప్తమి పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని రామకృష్ణానగర్‌లో కొలువైవున్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో స్వామి వారు 7 అశ్వాలపై సూర్యభగవానుడి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకోజామునుండే భక్తులు పెద్దఎత్తున స్వామి వారిని దర్శించు కున్నారు. రథసప్తమి రోజు సూర్యభగవానుడ్ని పూజిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భక్తుల అపార నమ్మకం. భక్తులు వేకోజామున జిల్లేడు ఆకులు తలపై ఉంచుకొని,చిన్నారులకు రేగుపండ్లు పోసి స్నానాలు చేయించారు. చిక్కుడు పందిళ్ళు వేసి స్వామి వారికి బెల్లపు పొంగలి నైవేద్య సమర్పించారు. శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో స్వామి వారిని సూర్యభగవానుడి రూపంలో దర్శించుకొని తరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అపస్మా ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు

బుచ్చి జనవరి 25 ప్రభాతవార్త : బుచ్చిరెడ్డిపాళెం అపస్మా ఆధ్వర్యంలో కోవూరు నియోజకర్గ ప్రైవేటు పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం బుచ్చిరెడ్డిపాళెం విశ్వభారతి హైస్కూల్‌ల్లో నిర్వహించగా 21 పాఠశాలల నుండి103 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా అపస్మా అధ్యక్షులు నేలనూతల శ్రీదర్ మాట్లాడుతు విద్యార్థులలో పోటీ తత్వాన్ని మరియు విజయం సాధించాలనే పట్టుదలను నిర్మాణం చేయడం కొరకు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు టెక్నో బుక్ ఆధారంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో 5400 మంది విద్యార్థులు పాల్గొన్నారు .ఏడు నియోజకవర్గాలలో పాఠశాల స్థాయి నుండే వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఫిబ్రవరి 4 జిల్లా స్థాయిలో పరీక్షలు నిర్వహించి నెల్లూరు టౌన్‌హాల్‌లో బహుమతి ప్రధానం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ గౌరవాధ్యక్షులు రామసుబ్బరెడ్డి,,అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, కార్యదర్శి మల్లేశ్వర్‌రెడ్డి, రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ చిట్టిబాబు, విశ్వవభారతీ కరస్పాండెంట్ మంజు ,ఎక్సెన్సీ కరస్పాండెంట్ అయూబ్ ఖాన్, శ్రీనివాసులురెడ్డి,మల్లి,వేణు, తదితరులు పాల్గొన్నారు.

కోటలో జాతీయ ఓటరు దినోత్సవం

కోట, జనవరి 25 ప్రభాతవార్త : కోట మండలంలో ఆదివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ ఓటర్లను తహశీల్దార్ కె.జయజయరావు సత్కరించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజే తలకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అని తహశీల్దార్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ద్వారా దేశ భవిష్యత్‌ను నిర్ణయించవచ్చని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌బికెఆర్‌లో ఘనంగా రథసప్తమి వేడుకలు

కోట, జనవరి 25 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకెఆర్ ఐఎస్‌టిలో ఆదివారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యోగా ఇన్‌స్ట్రక్టర్ రమాభాగ్య రథసప్తమి ప్రాముఖ్యతను వివరించారు. యోగా వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, సూర్య నమస్కారాలపై అవగాహన కల్పించారు. యోగా సభ్యులు యాస్మిన్, ప్రవల్లిక, తనుశ్రీ, విష్ణుప్రియ, యశస్విని తదితరులు ఆసనాలు ప్రదర్శి ంచి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక విద్యలో యోగాకు ఎఐసిటి అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇంజినీరింగ్ కోర్సులో పాఠ్యాంశంగా యోగా ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు, ఎన్‌సిసి ఆఫీసర్లు మల్లికార్జునరెడ్డి, మాధవయ్య పాల్గొన్నారు.

మూడుంచెలతో స్వర్ణపాలన ఫిభ్రవరి 15 నుంచి అమల్లోకి

కోట, జనవరి 25 ప్రభాతవార్త : ప్రజలకు ఇంటి వద్దనే సత్వరమే అవినీతి రహిత సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రవేశ పెట్టిన సచివాలయాలపై అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఐవీఆర్ఎస్ సర్వేలో ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని ప్రవర్తన సరిగా లేదంటూ ప్రజలు అభిప్రాయపడ్డారు. దీంతో సచివాలయ వ్యవస్థలో సంస్కరణలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సచివాలయాలను,స్వర్ణ గ్రామంగా మార్పు చేసి..పౌర సేవలపై పర్యవేక్షణ దిశగా అడుగలు వేశాయి. స్వర్ణ గ్రామలపై పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థను ఫిభ్రవరి 15 నుంచి అందుబాటులోకి రానుందిని అధికారులు చెబుతున్నారు. ఉద్యోగులపై పర్యవేక్షణ,పరిపాలన వ్యవహారాల కోసం జిల్లా, మండల స్థాయి అధికారుల్ని నియమించాలని నిర్ణయి ంచారు.సచివాయాల్లో కంప్యూటర్లు, యూపీఎస్,కొనుగోలు కోసం ప్రభుత్వం నిధులు సమకూరుస్తోంది. త్వరలోనే సామగ్రిని సరఫరా చేయనున్నట్లు తెలుస్తోంది.

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, జనవరి 25, ప్రభాతవార్త : లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, టౌన్ వెస్ట్ క్లబ్ సేవ కార్యక్రమాలలో భాగంగా డిస్ట్రిక్ట్ అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ యం.జె.యఫ్. లయన్ వై. గురునాథం మనవరాలు వై. గురు హెమిష పుట్టినరోజు సందర్భంగా గూడూరులోని గవర్నమెంట్ హాస్పిటల్ నందు బాలింతలకు పౌష్టికహారం, వారి పిల్లలుకు దుస్తులును పంపిణి చేసారు. ఈ కార్యక్రమానికి వైస్ డిస్ట్రిక్ గవర్నర్ యం.జె.యఫ్ లయన్ ఆర్.వి. రావు, వైజేపీ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ సుధాకర్, ట్రెజరర్ పి. గోపినాథ్ రెడ్డి, టౌన్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్, సెక్రటరీ వెంకయ్య, ట్రెజరర్ ప్రసాద్, పాస్ట్ జోన్ చైర్మన్ యం.జె.యఫ్ లయన్ పి. మురళి నాయుడు, పాస్ట్ ప్రెసిడెంట్ ఎస్.ఎల్.ఎన్.స్వామి, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ డి. రవీంద్ర రెడ్డి, పి.శివరాం, హరికృష్ణ, కావేరి, షఫీ, గురునాథం కుటుంబ సభ్యులు ఇచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్, 5వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్

కోట, జనవరి 25 ప్రభాతవార్త : కోటలోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, పాఠశాలల్లో నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు నోటిఫికేషన్లు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు (ఎవిఎల్) తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను కూడా అర్హులైన విద్యార్థులతో భర్తీ చేస్తామన్నారు. ఫిబ్రవరి 19వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఎపిజి సిఇటి.ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఏమైనా సాంకేతిక ఇబ్బందులు ఉంటే నేరుగా వచ్చి వివరాలు తెలుసుకోవచ్చని ప్రిన్సిపాల్ సూచించారు.

సందడిగా బాల్ బ్యాడ్మింటన్ ఇన్విటేషన్ టోర్నమెంట్

నెల్లూరు, జనవరి 25, ప్రభాతవార్త-వైద్యం : బాల్ బ్యాడ్మింటన్ ఇన్విటేషన్ టోర్నమెంట్ ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగాయి. రిపబ్లిక్ డే సందర్భంగా నెల్లూరులోని పాత మున్సిపల్ కార్యా లయం ఎదురుగా ఉన్న వైద్య ఆరోగ్యశాఖకు చెందిన కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ పోటీలను డీఎం అండ్ హెచ్ఓ వి.సుజాత ప్రారంభించారు. జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖకు చెందిన వివిధ టీమ్‌లు ఈ పోటీల్లో తలపడ్డాయి. ఈ టోర్నమెంట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చెందిన టీం మొదటి విజేతగా నిలిచింది. రెండవ విజేతగా పల్లిపాడు టీం కైవసం చేసుకుంది. విజేతలుగా నిలిచిన క్రీడాకా రులందరిని డీఎంహెచ్ఓ వి.సుజాత సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ

బిట్రగుంట జనవరి 25 ప్రభాతవార్త : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు హక్కు విలువను తెలియజేస్తూ అవగాహన ర్యాలీని మండలంలోని కప్పరాల తిప్ప సెంటర్ నందు ఆదివారం నిర్వహించారు ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది ఉన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందడమే కాకుండా ఓటు విలువ తెలుసుకొని సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి తిప్ప సెంటర్ నందు మానవహారం నిర్వహించారు. మండలంలోని అన్ని బిఎల్వోల పరిధిలో కూడా సచివాలయ ఉద్యోగులు ర్యాలీలు నిర్వహించి సీనియర్ ఓటర్లను సన్మా నించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తాసిల్దార్ భరత్ కుమార్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం చంద్రశేఖర్

కొడవలూరు,జనవరి 25 ప్రభాతవార్త: రాజ్యాంగంలో కల్పించిన హక్కుల ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకొని ప్రజాస్వామ్య విలువలను పర్యవేక్షి ంచేందుకు అందరూ కట్టుబడి ఉండాలని తహసీల్దార్ కె.చం ద్రశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉన్న జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాలు ఆవరణం నుండి జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. హై స్కూల్ నుండి అంకమ్మ గుడి వరకు నినాదాలు, ర్యాలీ చేస్తూ మానవహారం నిర్వహించారు. ఓటర్లను చైతన్యపరిచేలా ఓటు ప్రాముఖ్యతను వివరించి ప్రజాస్వామ్యంపై స్థిరమైన విశ్వాసం కలిగి, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన మరియు శాంతియుత ఎన్నికల గౌరవాన్ని నిలబెట్టుకుంటామని, జాతి, కులం, మతం,భాష, ఇతర ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు.అంతకముందు నూతన హక్కు యువతకి, సిటిజనులకు సాలు వాళ్ళతో సత్కరించి,ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఓ శ్రీనివాసులు,జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, వీఆర్వో దుర్గాప్రసాద్,సిబ్బంది మల్లికార్జున్,ప్రవీణ్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకుందాంస్ఫూర్తి రెడ్డి

కొడవలూరు, జనవరి 25, ప్రభాతవార్త : మండలంలోని 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు రాజ్యాంగంలో కల్పించిన హక్కుల ప్రకారం ఓటు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య విలువలను పర్యవేక్షించేందుకు అందరూ కట్టుబడి ఉండాలని స్థానిక తహసీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. మండలం నార్త్ రాజుపాలెం జడ్పీ హైస్కూల్ నందు జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. హై స్కూల్ ఆవరణము నుండి ఓటు హక్కు నమోదు చేసుకోవాలి, వినియోగించుకోవాలి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా రాజుపాలెం రోడ్డు వరకు వచ్చి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి మాట్లాడుతూ ఓటర్లను చైతన్యపరిచేలా ఓటు ప్రాముఖ్యతను వివరించి ప్రజాస్వామ్యంపై స్థిరమైన విశ్వాసం కలిగి, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన మరియు శాంతియుత ఎన్నికల గౌరవాన్ని నిలబెట్టుకుంటామని, జాతి, కులం, మతం,భాష, ఇతర ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అంతకముందు ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులతో పాటు ,ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ప్రియదర్శిని, మల్లికార్జున్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టంగా చదివితే ఫలితాలు మీ వెంటే

కోవూరు జనవరి 25 ప్రభాతవార్త : విద్యార్థి జీవితంలో పదవ తరగతి అనేది పునాది వంటదని, దీనిని పటిష్టంగా నిర్మించుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి శోభారాణి అన్నారు. కోవూరులోని గంగవరం గ్రామంలో ఉన్న గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో కోవూరు, కావలి, పొదలకూరు, నెల్లూరు, గూడూరు ఏఎస్‌డబ్ల్యూ పరిధిలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా చదివితే సత్ఫలితాలు మీ వెంటే వస్తాయన్నారు. వంద రోజుల ప్రణాళికను ప్రతి పదవ తరగతి విద్యార్థి పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే నూరుశాతం ఫలితాలు వస్తాయన్నారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మెండుగా ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. ప్రతి సబ్జెక్ట్‌ను ఇష్టంగా చదవాలన్నారు. ఇటీవల కాలంలో అన్ని వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిగా కల్పించడం జరిగిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ . శ్రీనివాసరావు మాట్లాడుతూ సిగ్గుపడి భయపడితే చదువు రాదన్నారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. చదువుకోమని ఒకరు చెప్తే కాదని, వారిలో వారికే చదవాలని ఆకాంక్ష మెరుగుపడాలన్నారు. మార్కులు మన వెంట పరిగెత్తాలే తప్ప మార్కుల వెంట ఎవరూ పరిగెత్తరాదన్నారు. సమయపాలన తప్పనిసరి అన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా దానిని సాధించాలనే పట్టుదల ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. కళాశాల డీన్ డాక్టర్ టీఎల్‌పీఎల్‌ఎన్ కుమార్ మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణులైన తర్వాత పాలిటెక్నిక్‌పై విద్యార్థులు దృష్టి సారిస్తే మంచి ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూలు తిరుపతయ్య, హజరత్తయ్య, మనోజ్, సుధా మణిలు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో 300 మంది పదవ తరగతి విద్యార్థులు హాజరయ్యారు.

యనాదులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

కావలి, జనవరి 25 ప్రభాతవార్త : యానాదులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పటు చేసి, ఎస్‌టి వర్గీకరణ చేపట్టాలని రాష్ట్ర యానాది సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి పెంచలయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా యానాది సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్ఎంకె కళ్యాణమండపం నందు ఆదివారం కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం అధ్యక్షులు పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంవ అన్ని కార్పోరేషన్‌లు ఏర్పాటు చేశారని వెనుకబడిన తరగతుల యనాది కార్పోరేషన్ మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. యానాదుల సమస్యలపై ఏప్రిల్ 14న ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ కోసం యానది గర్జన సభను బాపట్ల జిల్లా కేంద్రంగా ఏర్పటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షల మంది యానాదులు ఉన్నారని రాబోయే రోజుల్లో మా శక్తి ఎంటో ప్రభుత్వానికి తెలియపరిచేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల బ్రహ్మయ్య, రాష్ట్ర కోశాధికారి చలంచర్ల పేద బ్రహ్మయ్య, అధికార ప్రతినిధి పొన్నూరు అంకమరావు, చేవూరి సుబ్బారావు, కొమరిగిరి మల్యాద్రి బాకుల మురళీక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ అమరావతి 4వ రాష్ట్ర మహా సభను జయప్రదం చేయండి

– ఏపీ జేఏసీ అమరావతి, నెల్లూరు జిల్లా శాఖ చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి

నెల్లూరు కలెక్టరేట్, జనవరి 25, ప్రభాతవార్త : నెల్లూరు రెవిన్యూ అసోసియేషన్ భవనంలో ఫిబ్రవరి 5వ తేదిన విజయవాడలో గల తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగబోయే ఏపీ జేఏసీ అమరావతి 4వ రాష్ట్ర మహా సభను జయప్రదం చేయాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి, నెల్లూరు జిల్లా శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి, నెల్లూరు జిల్లా శాఖ చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ తేదీన విజయవాడలో గల తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగబోయే ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహా సభకు నెల్లూరు జిల్లాలో గల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అందరు సదరు సభకు హాజరయ్యి జయప్రదము చేయాలని తెలియజేసారు. ఈ సభకు తరలి వెళ్ళడానికి నెల్లూరు నుండి బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేసారు. విజయవాడలో జరగనున్న 4వ రాష్ట్ర మహాసభలో ముఖ్య అతిధులుగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పౌర సరఫరా శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొంటున్నారని తెలియజేసారు. నెల్లూరు జిల్లా నుండి సదరు సభకు వేలాదిగా తరలి వెళ్లి ఉద్యోగులకు రావల్సిన బకాయిలు, 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి తదితర ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారాల కొరకు మన గళం వినిపించాలని తెలియచేసారు. సదరు కార్యక్రమములో ఏపీ జేఏసీ అమరావతి జనరల్ జనరల్ సెక్రెటరి ఓ.వి. ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, మధ్యంతర భృతి, 12వ పిఆర్సి సెటిల్మెంట్స్, డీఏ బకాయిలు, పాత బకాయిలు, చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా మహిళా విభాగం చైర్పర్సన్ వసంత కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం పలు దఫాలుగా 67 వేల కోట్లు ఇచ్చిందని, మరో 2530 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కో చైర్మన్ ఈవీఎం శరత్ బాబు మాట్లాడుతూ చనిపోయిన ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల బకా యిలు పెండింగ్ ఉండడంతో ఆయా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ జిల్లా నాయకుడు ఎస్ కే జానీ భాష మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్సో ర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక సంఘం ఏపీజేసి అమరావతి అని, ఈ సమావేశానికి అత్యధిక సంఖ్యలో ఉద్యోగుల హాజరు అయ్యేలా కృషి చేస్తానని తెలియజేశారు. ఏపీజేఏసీ అమరావతి 4వ రాష్ట్ర మహాసభలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు కాంట్రాక్ట్ ఔటర్సింగ్ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో మహిళా విభాగం జనరల్ సెక్రటరీ చెన్నమ్మ, జనరల్ సెక్రెటరీ ఓవి ప్రసాద్, ట్రెజరర్ బాబురావు, అసిస్టెంట్ సెక్రటరీ ధారా రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్ కృష్ణ శివకుమార్, రాజేష్ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కే డానియల్ పేపర్ రావు సిహెచ్ గోపికృష్ణ తోపాటు ఆదివారం జిల్లాలోని ఇతర డివిజన్లకు సంబంధించిన వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలోనే నెంబర్‌వన్‌గా ఆత్మకూరు క్రీడా వికాస కేంద్రం

ఆత్మకూరు, జనవరి25 ,ప్రభాతవార్త: జిల్లాస్థాయిలోనే నెంబర్‌వన్‌గా అత్యాధునిక సౌకర్యాలతో 20 ఎకరాల్లో ఆత్మకూరు క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరులోని గురుకుల పాఠశాల సమీపంలో 1.80 కోట్ల వ్యయంతో నిర్మించనున్న క్రీడా వికాస కేంద్రానికి మంత్రి భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువతకు, ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చడమే లక్ష్యంగా క్రీడా వికాస కేంద్రాలు, నగర వనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సుమారు 20 ఎకరాల విశాల స్థలం లో ఆధునిక వసతి సౌకర్యాలతో క్రీడా వికాసకేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆరునెలల లోపే పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామనిస్పష్టం చేశారు. 2013 లో తాను ఆర్థిక శాఖామంత్రిగా ఉన్న సమయంలో ఆత్మకూరులో 2కోట్లతో క్రీడా ప్రాంగణాన్ని మంజూరు చేసి కొంతవరకు పనులు చేపట్టామని, అనంతరం వచ్చినప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశామని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వ హయాంలో 1.80 కోట్లతో మళ్ళీ పనులు ప్రారంభిస్తున్నా మన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మరిన్ని నిధులు సమీకరించి ఈ క్రీడా వికాసకేంద్రాన్ని వరల్డ్‌క్లాస్ స్టేడియంగా అభివృద్ధి చేస్తామని మంత్రి వెల్లడించారు. ఈ అభివృద్ధికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్, శాప్‌చైర్మెన్ రవినాయుడు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారని తెలిపారు. 1984 లో తాను స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్‌గా ఉన్న సమయంలో ఎసి సుబ్బారెడ్డి క్రీడా మైదానం, మెడికల్ కళాశాలలకు ప్రహరీగోడలు నిర్మించి భూములకు రక్ష

నెల్లూరును మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం : మంత్రి నారాయణ

ప్రతీ ఇంటికీ కుళాయినగరం నిండా నిఘా నేత్రాలు: మంత్రి నారాయణ మార్క్ అభివృద్ధి
అంతర్జాతీయ స్థాయిలో మున్సిపల్ పాఠశాలలు: మంత్రి నారాయణ ధీమా
దుష్ప్రచారాన్ని నమ్మలేదు.మెజారిటీతో బుద్ధి చెప్పారు:విపక్షాలపై మంత్రి నారాయణ ఫైర్
ప్రజల రుణం తీర్చుకుంటా.
అభివృద్ధిని అడ్డుకుంటే వదిలేది లేదు
అభివృద్ధిలో వెల్ఫేర్ అసోసియేషన్లను భాగస్వాములను చేస్తాం: మంత్రి వెల్లడి

నెల్లూరు, జనవరి 25, ప్రభాతవార్త-వైద్యం : నెల్లూరు నగర అభివృద్ధిలో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు వెల్ఫేర్ ఫెడరేషన్ 9వ వార్షికోత్సవ వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నారాయణకు ఫెడరేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.కార్యక్రమం ప్రారంభంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నెల్లూరు మేరీ జాన్ అనే ప్రత్యేక మేగజైన్‌ను ఆయన ఆవిష్కరించారు.

ఫెడరేషన్ సభ్యులు మాట్లాడుతూ.. మంత్రి నారాయణ

నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఉండటం తమ అదృష్టమని, నగర అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషిలో తామంతా సైనికుల్లా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.సభను ఉద్దేశించి మంత్రి నారాయణ మాట్లాడుతూ అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా నేను అనేక దేశాలు తిరిగాను అని. అక్కడ వెల్ఫేర్ అసోసియేషన్లు చాలా పటిష్టంగా ఉన్నాయన్నారు.కేవలం మెట్రో నగరాలకే పరిమితమైన ఈ సంస్కృతిని 9 ఏళ్ల క్రితమే నెల్లూరుకు పరిచయం చేసి, 8 అసోసియేషన్ల నుండి 42 అసోసియేషన్లకు విస్తరించిన చంద్రశేఖర్ రెడ్డి కృషి అభినందనీయం అని తెలిపారు.వచ్చే జూన్ నాటికి నగరంలోని ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి కనెక్షన్ అందిస్తాం అని. భద్రత కోసం 1000 సిసి కెమెరాలు, ట్రాఫిక్ నియంత్రణకు 7 చోట్ల ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. 200 కోట్లతో 15 మున్సిపల్ హైస్కూళ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నాం అని, తానపై గౌరవంతో సిఎస్ఆర్ (CSR) నిధులు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు.2017లో నగరం ఎదుర్కొన్న వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని కాలువల ఆధునీకరణ చేపడుతుంటే, దానిపై కూడా కొందరు రాజకీయం చేయడం విచారకరం అన్నారు. ప్రజల పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని తిరిగి మున్సిపాలిటీల అభివృద్ధికే ఖర్చు చేస్తున్నాం అని తెలియచేశారు.2019 లో కొందరి దుష్ప్రచారం వల్ల ఓడిపోయినప్పటికీ, వాస్తవాలను గ్రహించిన ప్రజలు 2024లో తనను భారీ మెజారిటీతో గెలిపించారని మంత్రి గుర్తు చేసుకున్నారు. అభివృద్ధి మరియు సంక్షేమమే ధ్యేయంగా ప్రజల రుణం తీర్చుకుంటానని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, ఇన్చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మురళీకృష్ణ స్వీట్స్ అధినేత గోసు సుబ్బారావు, 42 వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ ఓటర్స్‌ని సన్మానించిన ఆనం



సంగం జనవరి 25 ప్రభాతవార్త : సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామ పంచాయితీ లో నేషనల్ ఓటర్స్‌డే సందర్భంగా గ్రామ సర్పంచ్ఆనం ప్రసాద్‌రెడ్డి గ్రామ పంచాయితీ నందు గల సీనియర్ సిటిజన్స్‌ను శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామ పంచాయితీ నందుగల 18 సంవత్సరాలు నిండిన యువత ఓట హక్కును అప్లై చేసుకోవాలని తెలుపుతు ఓటు యొక్క ప్రాధాన్యతను తెలియపరిచారు. ఈకార్యక్రమంలో బిఎల్ఒ లక్ష్మీ స్వరూప, పంచాయితీ కార్యదర్శి ఉదయ్‌కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విశిష్ట సేవలందిస్తున్న రెడ్‌క్రాస్ కావలికే తలమానికం

కావలి, జనవరి 25 ప్రభాతవార్త : విశిష్ట సేవలు అందిస్తున్న రెడ్‌క్రాస్ కావలికే తలమానికం అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక రెడ్‌క్రాస్‌లో అభయం స్వచ్ఛందసేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 17వ మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈశిబిరంలో దాదాపు 200మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది రిపబ్లిక్ డే సదర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న ఈ సంస్థ కృషిని ప్రశంసించారు. రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్రాన్ని, నిర్మాణంలో ఉన్న భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కేంద్రాన్ని కావలిలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. దీని ద్వారా అనేకమంది చిన్నారులకు నిరంతర రక్త సరఫరా సాధ్యమవుతుందన్నారు. అభయం, టీం సీనియర్స్ రెడ్‌క్రాస్ వంటి సంస్థల సేవలు కావలిలో మరింత విస్తరించాలని ఆయన ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబునాయుడు, తిరివీధి ప్రసాద్, అభయం నిర్వాహకులు ఈవిఎస్ ఇలీంద్ర శ్రీవాణి, సీనియర్స్ అధ్యక్షులు వైఎస్.ప్రణీత్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డి.రవిప్రకాష్, కె.హరినారాపరెడ్డి, అరికట్ల మదుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు
మొదటి బహుమతి కైవశం చేసుకున్న పోనిక్స్ జట్టు

బుచ్చి జనవరి 25 ప్రభాతవార్త ; బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో సంక్రాంతి పురస్కరించుకొని ఎస్ఎస్‌సి క్రికెట్ టీం ఆధ్వర్యంలో చాంపియన్స్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి.ఈటోర్నమెంట్‌లో 30 జట్లు పోటీపోటీగా ఆడారు.వీరిలో గెలుపొందిన జట్లకు ఆదివారం నాడు అతిధులు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిధిగా జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యనాయుడు,టిడిపి పట్టణాధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, వైసిపి పట్టణ అధ్యక్షులు ,కౌన్సిలర్ షేక్ షాహుల్, కౌన్సిలర్ రహమత్, కో ఆప్షన్ సభ్యులు అల్లాబక్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్లో మొదటి బహుమతి గెలుచుకున్న పోనిక్స్ జట్టుకు జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు 30 వేల రూపాయాలు నగదును బహుమతి గా అందజేశారు. రెండో వ బహుమతి గెలుచుకున్న విక్టరీ బాయ్స్ జట్టుకు వవ్వేరు కో ఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులరెడ్డి,వైసిపి పట్టణ అధ్యక్షులు షాహుల్ 20 వేల రూపాయాలు నగదు బహుమతి అందజేశారు. మూడవ బహుమతి గెలుచుకున్న ఫ్రెండ్స్ ఆర్మీ జట్టుకు టిడిపి సీనియర్ నేత దొడ్ల కోదండరామిరెడ్డి టిడిపినాయకులు సుమన్ 10 వేల రూపాయాలు నగదు బహుమతిని అందజేశారు.ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతు బుచ్చి పట్టణంలో జిల్లా స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నేటి యువత పోన్లకు అంకితం కాకుండా క్రీడలపట్ల మక్కువ చూపాలన్నారు. ఓడిపోయిన వారు నిరాశ చెందకుండా రాబోయే రోజులలో జరిగే క్రికెట్ టోర్నమెంట్‌లో ఆడి విజయం దిశగా పయనించాలని సూచించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిస్తు యువతకు క్రికెట్ కిట్లను అందజేస్తున్నారని గుర్తు చేశారు. వచ్చే సంవత్సరం జరిగే క్రికెట్ టోర్నమెంట్‌కు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆహ్వానిస్తామని చెప్పారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఇటువంటి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న యువతను వారు అభినందించారు. క్రికెట్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సప్త వాహన సేవల్లో అలరించిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర్లుడు



బిట్రగుంట జనవరి 25 ప్రభాతవార్త : బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో దేవస్థాన చరిత్రలో తొలిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం సాంప్రదాయం ప్రకారం రథ సప్తమిని పురస్కరించుకుని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరులకు ఏడు వాహనాలతో సేవలు నిర్వహించారు. ఆదివారం ఉదయం సూర్య ప్రభ వాహనంతో మొదలైన ఈ సేవలు రాత్రి చంద్రప్రభ వాహనంతో అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి తొలిసారిగా జరిగిన ఈ వాహన సేవల్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు హాజరై శ్రీ ప్రసన్నుడిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. దీంతో బిలకూటక్షేత్రమైన కొండ బిట్రగుంట లో గోవింద నామస్మరణలతో మారు మ్రోగింది. ఇకపై తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే ప్రతి ఏడాది రథసప్తమి ఉత్సవాలతోపాటు అన్ని ఆర్జిత సేవలు కూడా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి రాధాకృష్ణ తెలిపారు. ఇప్పటికే ప్రతి మాసంలోని పౌర్ణమి రోజు గరుడ సేవ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

అల్లూరు, జనవరి 25 ప్రభాతవార్త : అల్లూరు మండలం నార్త్ మోపూరులోని శ్రీ చైతన్య ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు ఆదివారం కావలి నియోజకవర్గ అపస్మా నియోజకవర్గ స్థాయి టాలెంట్ టెస్టును నిర్వహించారు. 9పాఠశాలల నుంచి 49మంది విద్యార్థులు ఈ టెస్టులో పాల్గొన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిలాల ఆపస్మా ట్రెజరర్ క్రిష్ణారావు, అఖిలేష్‌రెడ్డిలు ముఖ్యఅతిధులుగా పాల్గొని క్వశ్చన్ పేపర్‌ను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో ఆపస్మా కావలి నియోజకవర్గ అధ్యక్షులు కె.శివకుమార్ సెక్రటరీ గోపాల్‌రెడ్డి, ట్రెజరర్ రాధాక్రిష్ణ, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గోపూజ,సూర్యభగవానుడికి పూజలు

బుచ్చి జనవరి 25 ప్రభాతవార్త : రధసప్తమి పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీవాసవీనగర్‌లో సత్యాన్వేషణ ధ్యాన యోగ ఆధ్యాత్మిక క్షేత్రంలో రధసప్తమి పురస్కరించుకొని ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువు గుబ్బా లక్ష్మీనారాయణ నేతృత్వంలో గోపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. 41 రోజులు నిత్యం జ్ఞాన యజ్ఞం చేశారు . 41 వ రోజు సామూహిక జ్ఞాన హోమం ,సూర్య నమస్కారాలు నిర్వహించారు. అనంతరం సూర్యా రాధాన, అమృతహృదయం, లలితా సహస్రనామం,పారాయణం తదితరులు కార్యక్రమాలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో గీతా ప్రబోధక్, నిత్యాగ్ని హోత్రులు , చైర్మన్ గీతా వైభవ్ ట్రస్టు నజీర్‌భాషా చే గీతాపారాయణం చేశారు. భగవద్గీత అంటే శ్రీకృష్ణ పరమాత్మ మానవుడి జీవిన విధానానికి సులభమైన మార్గం చూపే గైడు అని ఆయన అభివర్ణించారు. ప్రతి ఒక్కరు ఆత్మస్వరూపులేనని అన్నారు.ప్రతి ఒక్కరు నిత్యం కొద్దిసేపు అయినా ధ్యానం చేయాలని సూచించారు. ప్రతి ఇంట భగవద్గీత ఉండాలని అన్నారు.అనంతరం కందుకూరు నుండి వచ్చిన వర్ధమాన గాయకులు రాయిసం వెంకట రమేష్ భగవద్గీత ,భక్తి గీతాలు ఆలపించారు. భక్తులు మంత్ర ముగ్ధులైయ్యారు.మద్యహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈకార్యక్రామానికి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా యోగా గురువు లక్ష్మీనారాయణ, ధనబాగ్యలక్ష్మీలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పతంజలి టీమ్ పెంచలయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అదేశాలతో స్టడీ మెటీరియల్ అందజేత

కావలి, జనవరి 25 ప్రభాతవార్త : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో కావలి, వెంగళరావునగర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులు పదవ తరగతి స్టడి మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కనుపర్తి రాజశేఖర్, వైకాపా జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

సూర్యభగవానుడి అవతారంలో కోదండరామస్వామి

బుచ్చి జనవరి 25 ప్రభాతవార్త : రధసప్తమి పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరామస్వామి వారి ఆలయంలో స్వామి వారు సూర్యభగవానుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గోని స్వామి వారిని దర్శించుకున్నారు. చీకట్లను తొలగించి, సమస్తలోకాలకు వెలుగులు నింపే సూర్యభగవానుడి ఆశీస్సులు అందరికి ఉండాలని అర్చకులు వేద మంత్రాలతో దీవెనులు చేశారు.కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. బెజవాడ నరేష్ చంద్రరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలి

కావలి, జనవరి 25 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని కావలి ఆర్డీఓ సన్నీవంశీక్రిష్ణ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆర్డీఓ ఆధ్వర్యంలో పట్టణం లోని ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహి ంచి ఆర్డీఓ కార్యాలయం నుంచి స్థానిక ఆర్టీసి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు అందజేయడం, సీనియర్ సిటిజన్ల ఓటర్లను సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రావన్‌కుమార్, తహశీల్దార్ శ్రావన్‌కుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేసిన దామిశెట్టి

కావలి, జనవరి 25 ప్రభాతవార్త :త్రీఏసైడ్ వాలీబాల్ పురుషులు, మహిళలకు సంబంధించిన పోటీలు స్థానిక డిబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పురుషులు, మహిళలు, క్రీడాకారులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు పోటీతత్వంతో ఆడి క్రీడల్లో విజయాలను సొంతం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత యువతి, యువకులు చక్కటి ప్రదర్శన చేసి జాతీయస్థాయికి ఎదగాలని కోరారు. గొలుపు ఓటములు క్రీడల్లో సహజమని కొనియాడారు. ఈ క్రీడలకు రాష్ట్ర కార్యదర్శి బాలాజీ సహకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏఓ జి.రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ టీవి.రావు, మేనేజర్లు, పీడి దాసరి శివసాగర్ కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రాథమిక దశ నుంచి పోటీతత్వాన్ని అలవరుచుకోవాలి

కోవూరు జనవరి 25 ప్రభాతవార్త : చిన్నారులు ప్రాథమిక దశ నుంచి క్రీడల పట్ల దృష్టి సారిస్తే వారి మెదడుకు మంచి పదును వస్తుందని రిటైర్డ్ ఏజీపీ మధుసూదన్‌రావు అన్నారు. కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో ఉన్న షటిల్ కోర్టులో కోవూరు షటిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఏజీపీ మధుసూదన్‌రావు సహకారంతో యువతకు షటిల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీలను క్రమం తప్పకుండా యువత దృష్టి సారిస్తే అది వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

పేదవాడి ఆరోగ్యానికి అండగా ముఖ్యమంత్రి సహాయనిధి
..ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ

రాపూరు, జనవరి 25, ప్రభాతవార్త : రాష్ట్రంలోని పేదవారి ఆరోగ్యానికి అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తున్నట్లు వెంకటగిరిశాసనసభ్యుడు కురుగోండ్ల రామకృష్ణ తెలిపారు. ఆదివారం రాపూరులోని మద్దెలమడుగు సెంటర్‌లోని తెలుగుగంగ అతిధిగృహంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల్లోని లబ్ధిదారులకు రూ. 34 లక్షల 71 వేల 372 రూపాయిలకు సంబందించిన చెక్కులను అందజేశారు. రాపూరు మండలంలో 9 మంది లబ్ధిదారులకు సంబందించి రూ. 4 లక్షల 75 వేల 789 రూపాయిల చెక్కులను ఆందజేశారు. ఈ కార్యక్రమంలో రాపూరు సహకార బ్యాంకు అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి,రాపూరు క్లస్టర్ ఇన్‌చార్జ్ నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి తిక్కమనేని ప్రసాద్ నాయుడు, రాపూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు ఏదోటి కోటి నాయుడు,రాపూరు ,సైదాపురం మండల టిడిపి అధ్యక్షులు చల్లా రఘు రామి రెడ్డి, అమ్మినేని సుబ్రమణ్యం నాయుడు, మండల కోఆప్షన్ సయ్యద్, రాపూరు పంచాయితీ మాజీ ఉప సర్పంచ్ షేక్ ముక్తియార్, పరంధామి రెడ్డి పలువరు సియం రిలీఫ్ ఫండ్ లబ్దీదారులు వున్నారు.

సృష్టిలో అతి మధురమైనది స్నేహం ఒక్కటే
పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

వింజమూరు, జనవరి 25, ప్రభాతవార్త వింజమూరు బాలుర ఉన్నత పాఠశాలలో 1977- 78 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆనాటి జ్ఞాపకాల నెమరువేత మధ్య ఆదివారం స్థానిక వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఆత్మీయ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మద్దూరు గోపాల్‌రెడ్డి, డాక్టర్ రాజశేశ్వరరావు, కొండా ప్రసాద్ , పులిచెర్ల నారాయణరెడ్డి, గంగిశెట్టి కామేశ్వరరావు మాట్లాడుతూ దాదాపుగా నాలుగు దశాబ్దాల అనంతరం ఒకరికొకరు కలుసుకోవడం ఎంతో శుభపరిణామం అని తెలిపారు. సృష్టిలో అతి మధురమైనది మనిషి జీవితంలో ఎన్నటికి మరువలేనిదని ఒక్క స్నేహం మాత్రమే అన్నారు. చదువుకునే రోజుల్లోనే అల్లరి గురువుల శిక్షణ పాఠశాల అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ అలనాటి విద్యార్థి జీవితాన్ని గుర్తు చేసుకోవడంతో ఎంతో ఆనందాన్ని పొందారు. రోజంతా సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు. తమ స్నేహాన్ని ఇలాగే కొనసాగించాలని కష్టసుఖాలలో తోడుండాలని అందరూ నిర్ణయించుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం పాత మిత్రులందరికి అనంతరం వారు చదివిన పాఠశాలకు విచ్చేసి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం వెలికి తీసేందుకే ప్రతిభ పరీక్ష

గూడూరు, జనవరి 25, ప్రభాతవార్త : గూడూరులోని సొసైటీ నందు గల రోటరీ భవన్ నందు అపస్మా నియోజకవర్గ స్థాయి మనోహర్ రెడ్డి మెమోరియల్ టాలెంట్ జరిగింది. ఈ సందర్భంగా అపస్మా నియోజకవర్గ ప్రెసిడెంట్ జీవి పవన కుమార్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం గత 8 సంవత్సరాలుగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటిగా పాఠశాల స్థాయిలో ఈ పరీక్షలు నిర్వహించి పాఠశాల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకి నియోజకవర్గ స్థాయిలో ఈరోజు పరీక్ష నిర్వహించామన్నారు. ఇందులో వివిధ పాఠశాలల నుండి 37 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో విజేతలుగా గెలుపొందిన విద్యార్థులు ఫిబ్రవరి 5న నెల్లూరులో జరిగే జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారు అన్నారు. ఈ పోటీలలో నియోజకవర్గ స్థాయిలో మొదటి బహుమతి బెన్ వీ నిహాల్ జీవీఎస్ పాఠశాల, రెండవ బహుమతి పూజిత ఆదిశంకర పాఠశాల, మూడవ బహుమతి లోకేష్ గాయత్రి పాఠశాల మరియు హాసిని ఎల్‌వీపీ పాఠశాల విజేతలుగా నిలబడ్డారు. వీరికి తదనంతరం జ్ఞాపకాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగనాథుడి సన్నిధిలో మంత్రి నారాయణ దంపతులు

నెల్లూరు, జనవరి 25, ప్రభాతవార్త-విద్య : రథసప్తమి వేళ భక్తుల కోలాహలం. మంత్రి నారాయణ, రమాదేవి దంపతులకు ఆలయ అధికారుల పూర్ణకుంభ స్వాగతం.రంగడి చెంత మంత్రి నారాయణ దంపతులు ఘాట్ ఆధునీకరణకు హామీ 2018లోనే ఆలయ అభివృద్ధి మొదలుపెట్టాం .స్వామికి 7 వాహనాలు చేయించాం.చంద్రబాబు పాలనలో రాష్ట్రం బాగుండాలి.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి.నెల్లూరు నగర వాసుల ఆరాధ్య దైవం శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తన సతీమణి రమాదేవితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయానికి చేరుకున్న మంత్రి నారాయణ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఖిపూర్ణకుంభఖి స్వాగతం పలికారు.రథసప్తమి సందర్భంగా సతీమణి రమాదేవితో కలిసి మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై కొలువైన స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వేద పండితులు మంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు.అనంతరం.మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి మరియు ఏర్పాట్లపై కీలక వ్యాఖ్యలు చేశారు..ఈ ఏడాది రథసప్తమికి సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేసి, అందుకు తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు..2018లోనే ఆలయ అభివృద్ధికి తాము ప్రత్యేక కృషి చేశామని మంత్రి గుర్తు చేశారు. స్వామివారి ఉత్సవాల కోసం ఏడు వాహనాలను ఏర్పాటు చేశామని, భక్తుల పుణ్యస్నానాల కోసం పెన్నా ఘాట్‌ను త్వరలోనే ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు..ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ ఆష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్న